18న ఎస్‌ఆర్‌ఆర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న స్థానిక ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 15 సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొని 600 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటిఐ, ఎంబిడి, ఫార్మసీ, ఎంబిఎ, ఎం.కామ్ అర్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయస్కులైన యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇతర వివరాలకు 8688977277, 8247788247 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ధాన్యం దళారుల పాలేనా..!

- ధాన్యం సేకరణలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా
- సేకరణ లక్ష్యం 2.60 లక్షలకు కుదింపు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేస్తామని పాలకులు, అధికారులు చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో అమలుకు అసలు పొంతనే ఉండట్లేదు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేస్తున్న

అన్నదాతలకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని సేకరించాల్సి ఉన్నా లక్ష్యాన్ని కుదించడంతో చివరకు దళారులకు అమ్ముకోవాల్సి పరిస్థితి వస్తోంది.

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది 2.30 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని మొదట్లో అంచనా వేశారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మెట్టలో పలువురు రైతులు పంటలను నష్టపోయారు. దాంతో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు తాజాగా అంచనా వేస్తున్నారు.

దళారులకు అమ్ముకోక తప్పదా.?

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనేక నిబంధనలను విధిస్తుంది. ప్రధానంగా తేమ శాతం నిబంధనతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. దానికి తోడు ఈ ఏడాది నుంచి భూమి గల రైతు బయోమెట్రిక్ ఉంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామనే నిబంధన తప్పనిసరి చేయడంతో కౌలు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం యంత్రాల ద్వారా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గండేపల్లి, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, కరప, తాళ్లరేవు, కాజులూరు, కాకినాడ రూరల్ తదితర మండలాల్లో 30 శాతం కోతలు పూర్తయ్యాయి. 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీనిలో సుమారు 76 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం స్థానిక అవసరాలకు పోగా మిగిలిన 4.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. 3.11 లక్షల ధాన్యాన్ని సేకరిస్తామని అధికారులు గత నెలలో ప్రకటించారు. కానీ సివిల్ సప్లయీస్ అధికారులు మాత్రం 2.60 లక్షల మెట్రిక్ టన్నులకు లక్ష్యాన్ని కుదించింది. దీనిపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల నుంచి ఎంత ధాన్యాన్ని అయినా కొనుగోలు చేస్తామని ఓ పక్క మంత్రులు, ఎంఎల్ఎలు, జిల్లా అధికారులు చెబుతుండగా ఇప్పుడు వర్షాభావ పరిస్థితుల వల్ల ఉత్పత్తి తగ్గుతుందనే కారణంతో సేకరణ లక్ష్యాన్ని కుదించడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సిందేనా అంటూ నిట్టూర్చుతున్నారు. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలు, ఇతర ఖర్చులతో కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో రైతులు దిగాలు చెందుతున్నారు. అప్పులే మిగిలేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యు.కొత్తపల్లి మండలం వాకటిప్పలో యంత్రం ద్వారా వరి కోత

మొత్తం ధాన్యం కొనాలి

దళారుల ప్రమేయం లేకుండా ఉత్పత్తి అయిన ధాన్యంలో స్థానిక అవసరాలకు పోగా మిగిలిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలి. ప్రభుత్వం లక్ష్యాన్ని కుదించడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో తక్కువ ధరకు దళారులకే అమ్ముకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవాలి.

- తిరుమలశెట్టి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, ఎపి రైతు సంఘం.

లక్ష్యాన్ని అవసరానికి అనుగుణంగా పెంచుతాం

జిల్లాలో 262 కొనుగోలు కేంద్రాల ద్వారా 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేలా ఏర్పాటు చేశాం. వాటి ద్వారా ధాన్యాన్ని కొంటాం. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని అవసరమైతే పెంచుతాం. ఎవరూ దళారులకు అమ్ముకోవద్దు. ఎప్పటికప్పుడు సొమ్ములు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డి.పుష్పమణి, డిఎం, సివిల్ సప్లయీస్.

ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు అర్హత పొందిన యువత అందరూ ఓటర్లుగా నమోదు పొందేలా చైతన్య పరుస్తూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను విస్తతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఇఆర్ఒలను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కోర్టు హాల్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రక్రియ క్రింద చేపట్టిన ఓటర్ల నమోదు, జాబితాల సవరణ, రానున్న ఎన్నికల నిర్వహణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో సవరణ ప్రక్రియలో ఇప్పటి వరకూ అందిన ఫారం-6,7,8 ధరఖాస్తుల పరిష్కారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. జనాభా పెరుగుదల రేటు ఆధారిత అంచనా ప్రకారం జిల్లాలో సుమారు 32 వేల మంది కొత్తగా ఓటు హక్కు అర్హత పొందారని, ఇందులో ఇప్పటికే 11 వేల మంది ముసాయిదా జాబితాలో చేరగా, సుమారు మరో 22 వేల మంది ఇంకా ఓటరు నమోదు పొందవలసి ఉందని చెప్పారు. వీరందరినీ ఓటర్లుగా నమోదు చేసేందుకు అన్ని కళాశాలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. నియోజక వర్గాలవారీగా టెంపరరీ స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ఏర్పాటుకు భవనాలను గుర్తించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ప్రకియ సజావుగా నిర్వహించేందుకు వివిధ అంశాలపై తహశిల్దారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కతికా శుక్లా జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ప్రక్రియకు సంబంధించిన కార్యకలాపాలపై వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), చోడిశెట్టి రమేష్ బాబు (బిజెపి), గదుల సాయి బాబా(టిడిపి), ఆకుల వెంకట రమణ(కాంగ్రెస్), సబ్బారపు అప్పారావు (బిఎస్‌పి) పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజారక్షణ భేరికి తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

అసమానతలు లేని అభివద్ధి కోసం విజయవాడలో సిపిఎం తలపెట్టిన బహిరంగ సభకు సామర్లకోట నుంచి బయలుదేరిన కార్యకర్తల వాహనాన్ని బుధవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలు, ప్రజా సమస్యలపై కాక వ్యక్తిగత దూషణలతో జరుగుతున్నాయన్నారు. ఇది ప్రజానీకానికి ఏ మాత్రం మంచిది కాదని, ప్రజా సమస్యలపై చర్చించాలని దాని కోసమే ప్రజా రక్షణ భేరి, ప్రజా ప్రణాళిక నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్యాస్ రూ.400కి ఇవ్వాలని, పెట్రోల్ రూ.60కి ఇవ్వాలని, విద్యుత్ యూనిట్ రూపాయికి ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లు వద్దని, తలకు 10 కేజీల ఉచిత బియ్యం ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, 2 సెంట్ల ఇల్లు, రూ.5లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని ఇంటి పన్ను, చెత్త పన్ను, విద్యుత్ పన్ను, తగ్గించాలని, ఇసుక ఉచితంగా ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని, ప్యాసింజర్ రైళ్లు కొనసాగించాలని, ఎక్స్‌ప్రెస్‌లలో స్లీపర్ క్లాసులు పెంచాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆలోచన రద్దు చేయాలని, ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బాలం శ్రీనివాస్, కరణం గోవిందరాజు, నాయకులు నరవ సురేష్, చల్లా మహేష్, దారభాని కృష్ణ, ప్రజాసంఘాల నాయకులు, పి.ప్రసాద్, ఎం.బాబూరావు, ఎ.కనకారావు, కె.వీరబాబు, ఎన్.సత్యనారాయణ, ఫాతిమా, వరలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కెఎస్‌సిసిఎల్ అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు సత్వరం అందుబాటులోకి తేవాలని కలెక్టర్, కెఎస్‌సిసిఎల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్ కోర్టు హాలులో కెఎస్‌సిఎల్ 39వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో కమిషనర్, సిఇఒ సిహెచ్.నాగనరసింహారావుతో కలిసి స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ పనులపై సమీక్షించారు. తొలుత జులై నెలలో జరిగిన 38వ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించారు. అనంతరం సమ్మిళిత, సుస్థిర అభివద్ధి లక్ష్యంగా స్మార్ట్‌సిటీ మిషన్ ప్రాజెక్టు క్రింద ఇప్పటి వరకూ పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం జరుగుతున్న పనుల ప్రగతిపై చర్చించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకటరావు, స్వతంత్ర డైరెక్టర్ టివిఎస్.కృష్ణకుమార్, జెవిఆర్.మూర్తి, కంపెనీ సెక్రటరీ ఎం.ప్రసన్నకుమార్, ఫైనాన్స్ మేనేజర్ సిహెచ్.సంతోష్ పాల్గొన్నారు.

ఆదిత్యలో ఆండ్రాయిడ్ అప్లికేషన్‌పై సెమినార్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యాన బుధవారం ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్మెంట్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన ఎస్.వరప్రసాద్ మాట్లాడుతూ నేటి ఇంటర్నెట్ యుగంలో మొబైల్, టాబ్లెట్ వంటి సాధనాలు పని చేసేందుకు ఈ ఆండ్రాయిడ్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ ఎంతో ముఖ్యమైనదని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ నూతన సాంకేతికతకు అనుగుణంగా వివిధ కోర్సులను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానం చేరుకోవాలని అభిలషించారు. విభాగాధిపతి డాక్టర్ ఆర్‌వి.విజయకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులందరూ నూతన అప్లికేషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. కో ఆర్డినేటర్స్ శైల రామ్, కొండపల్లి జయరామ్ పాల్గొన్నారు.

21న మత్స్యకారులకు నష్టపరిహారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 21న 24,500 మంది మత్స్యకార కుటుంబాలకు ఒఎన్‌జిసి నష్ట పరిహారం రూ.216 కోట్లు అందించనున్నట్టు వైసిపి అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ తెలిపారు. గతంలో మూడు విడతలుగా ఒక్కొక్కరికీ రూ.46 వేలు చొప్పున మనిషికి రూ.1,38,000 అందజేశామని, ప్రస్తుతంనాలుగో విడతగా ఒక్కొక్కరికీ ఆరు నెలల నష్టపరిహారం మేరకు రూ.69 వేలు జమ చేయనున్నట్టు స్పష్టం చేశారు. నవంబర్ 21న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారులకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పంచాయతీ పరిధిలోని గాడిమొగ, పెదవలసల, లక్ష్మీపతిపురం, చినవలసల గ్రామాల్లో జరిగిన సభల్లో ఎంఎల్ఎ మాట్లాడారు. చమురు సంస్థల వల్ల మత్స్య సంపద కోల్పోవడం వల్లే ఆయా సంస్థలు నష్టపరిహారం అందిస్తున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్థలు వస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగిలో జరగబోయే సభలో మత్స్యకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, అంకాడి అంజిబాబు, పోతాబత్తుల నూకరాజు, రేకాడి నరసింహమూర్తి, ఎంపిడిఒ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ పాల్గొన్నారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సతీష్

పౌష్టికాహారం అవసరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

క్షయ వ్యాధిగ్రస్తులు మందులతో పాటు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ అన్నారు. ఈ మేరకు పవర్ గ్రిడ్ సంస్థ ఏర్పాటు చేసిన పౌష్టికాహార కిట్లను 50 మంది రోగులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా టిబి రోగులకు పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ అలమండ చలమయ్య, కాకాడ నాగేశ్వరరావు, తొండరపు రాంబాబు, అనిల్ కుమార్, అన్ని బాబు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

యు.కొత్తపల్లి : నాగులపల్లి ఉప్పరగూడెంలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను బుధవారం వైసిపి రాష్ట్ర నాయకులు వడిశెట్టి నారాయణరెడ్డి, నాగులపల్లి ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీవి పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని, దుప్పట్లను పంపిణీ చేశారు. జక్కి శ్రీనివాసరావు, గుర్రాల ఏసబ్బు, అబ్బిరెడ్డి సుబ్బిరెడ్డి, చింతపల్లి సత్యనారాయణ రెడ్డి, అబ్బిరెడ్డి రాముడు, దడాల సత్తిబాబు, గుర్రాల ఆశీర్వాదం, ఎస్.సుబ్బారావు, జ్ఞానానందం పాల్గొన్నారు

100 మందికి వైద్య పరీక్షలు

తాళ్లరేవు : డయబెటిక్ డే సందర్భంగా కోరింగ కాలేజ్ అఫ్ ఫార్మసీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైదులు 100 మందికి డయబెటిక్ మీద అవగాహన కల్పించారు. పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు వివరించారు. కోరింగ అప్పర్ ప్రైమరీ స్కూల్లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులుకు ఆటల పోటీలు, సాంస్కృతిక నృత్యాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరింగ విద్యాసంస్థల సెక్రటరీ ప్రగాళ్లపతి కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కల్కిమూర్తి కళాశాల ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి, స్కూల్ హెచ్ఎం ఉమా మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో మానసిక వికాసం

గ్రంథాలయాలతో మానసిక వికాసం సాధ్యమని పలువురు అన్నారు. బుధవారం పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడారు. అనంతరం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, గల్లా సుబ్బారావు, పార్థసారథి, రాజా, సత్యనారాయణ పాల్గొన్నారు. **పెద్దాపురం** శాఖాగ్రంథాలయంలో రెండో రోజు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంఇఒలు ప్రభాకర్ శర్మ, చౌదరి, మున్సిపల్ కౌన్సిలర్లు తాటికొండ వెంకటలక్ష్మి, విడదాసరి రాజా, ఆరెళ్ల వీరరాఘవ, వాసంశెట్టి గంగ, షేక్ రఫీ ,గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలోని డిగ్రీ, పీజీ కళాశా గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సంజయ్ కుమార్, గ్రంథాలయోద్యమ రూపకర్త అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. 14వ తేదీ నుంచి 20 వరకు విద్యార్థులకు గ్రంథాలయాలపై వక్తత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. **ఏలేశ్వరం** మంచి పుస్తకం పఠనం ద్వారా మంచి స్నేహితుని కంటే ఎక్కువని సీనియర్ పాఠకుడు ఉడతల రమణారావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ ఉన్నారు. **సామర్లకోట రూరల్** బచ్చు ఫౌండేషన్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. వెంకటేష్, యార్లగడ్డ రాజేష్, ప్రసాద్ పాల్గొన్నారు. **పిఠాపురం** పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, వి.సత్యప్రియపుస్తకాల ప్రాధాన్యత, చదవడం ద్వారా ఉపయోగాలు వివరించారు.

గండేపల్లిలోని ఆదిత్య కళాశాలలో..

ప్రత్యేక సంచికలను అందుకున్న విద్యార్థులు

'చిరుమువ్వల సవ్వడి'తో ప్రతిభ

గండేపల్లి : ప్రజాశక్తి దినపత్రిక అనుబంధంతో విద్యార్థుల కోసం చిరుమువ్వల ప్రత్యేక సంచిక ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని శ్రీ గీతం విద్యాసంస్థల కరస్పాండెంట్ విఎస్‌పి చౌదరి అన్నారు. గండేపల్లిలో శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చిరుమువ్వల పిల్లల ప్రత్యేక సంచికను బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం ఎక్కువ అవడంతో పిల్లల్లోని సృజనాత్మకతను తెలియజేయడం కష్టమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి రామచంద్రరావు, శ్రీ గీతం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

పెద్దాపురం : రబీ సీజన్లో రైతులు తక్కువ కాల వ్యవధి గల పంటలను పండించే విధంగా అవగాహన పెంచాలని ఎడిఎ దైవకుమార్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి, ఇరిగేషన్ సిబ్బందికి రబీ సీజన్‌లో పంట సాగు విధానాలు, విత్తనాలు, ఎరువులు అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేరులో నీటిలభ్యత తక్కువగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రబీ సీజన్లో ప్రతి గ్రామానికి సాగునీరందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు జితేంద్ర, ఎఒ కె.సంజయ్ కుమార్, ఎఇఒ ఎఎన్.ప్రసాద్, ఏలేటి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంతో ప్రజా సంక్షేమం

ప్రజాశక్తి - పెద్దాపురం, రౌతులపూడి, జగ్గంపేట రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారానే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం అమలు జరుగుతోందని హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం మిరపకాయల వీధి సచివాలయం పరిధిలోని ప్రాంతాలలో బుధవారం నిర్వహించిన జగనే ఎందుకు రావాలి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, ఆరేళ్ల వీరరాఘవ, విడదాసరి రాజా, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడే వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, చింతా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రౌతులపూడిలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యుడు గొల్లు లక్ష్మణమూర్తి ములగపూడిలో అభివద్ధి. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు చింతకాయల సత్యనారాయణ, సతీష్ కుమార్, పసగడుగుల నానాజీ పాల్గొన్నారు. జగ్గంపేట రూరల్ కాట్రావులపల్లిలో వైసిపి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టా సుగుణ రావు, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, సూరిమిల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రఘురాం

ఘనంగా సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

రాయభూపాలపట్నంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో బుధవారం 70వ జాతీయ సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం డైరెక్టర్లు పాము గోవిందు, గంగుమళ్ల నూకరాజు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ సహకార వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్, సబ్ డివిజనల్ అధికారి జెఎన్‌బి.ప్రసాద్ సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, గ్రామీణులకు అందచేస్తున్న సహాయ సహకారాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సిఇఒ ఎన్‌వివి.సత్యనారాయణ, సిబ్బంది టివి.పాపారావు, కె.రాంబాబు, పివి రమణ పాల్గొన్నారు. స్థానిక డివిజనల్ సహకార అధికారి వారి కార్యాలయంలో డివిజనల్ సహకార అధికారి కె.పద్మ సహకార జెండాను ఆవిష్కరించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం పాత్ర,రూ 5 లక్షల కోట్ల డాలర్ల భారత ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.ఏసుబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు జి.చంద్రశేఖర్, జిఎన్‌వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కేంద్రంలో సహకార వారోత్సవాలు

కార్టూ'నిజం'



అసాంఘిక కార్యకలాపాలతో భవితకు ముప్పు

ప్రజాశక్తి-కాజులూరు

అసాంఘిక కార్యకలాపాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎస్.తులసిరామ్ సూచించారు. బుధవారం మండలంలోని కోలంక సచివాలయ ఆవరణలో స్థానిక యువతీ యువకులు గ్రామ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తులసీరామ్ మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులైతే భవిష్యత్తు పాడవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు నడవడికపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మౌనిక నాగరాజు, ఎంపిటిసి సభ్యులు పంపన పద్మావతి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మల్లెల శ్రీనివాస్, సచివాలయ మహిళా పోలీస్ మల్లాడి సత్య ధనలక్ష్మి, నందికోళ్ల సత్తిబాబు, పిల్లి దుర్గబాబు, పచ్చిపాల శేషారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో మహిళ అరెస్టు

ప్రజాశక్తి-రావులపాలెం

చోరీ కేసులో మహిళను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఎస్‌పి శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట ఇన్‌ఛార్జి డిఎస్‌పి సుంకరమురళీమోహన్ పర్యవేక్షణలో రావులపాలెం సిఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో రావులపాలెం బస్టాండులో తాడేపల్లిగూడెంకు చెందిన పుప్పాల గోరి అలియాస్ సయ్యద్ గోరి అనే మహిళ అనుమానాస్పదంగా సంచరిస్తోంది. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించామని ఎస్ఐ ఎం.వెంకటరమణ తెలిపారు. విచారణలో పలు విషయాలు బయటపడ్డాయన్నారు. గతేడాది డిసెంబర్‌లో తణుకు నుంచి రావులపాలెం ప్రయాణిస్తున్న వారి నుంచి బంగారు వస్తువులు, ఈనెల 8న అమలాపురం నుంచి రాజమండ్రి వెళ్తున్న బస్సులో ఒక మహిళ వద్ద బంగారు నెక్లెస్ దొంగిలించినట్లు అంగీకరించిందన్నారు. ఈ రెండు కేసులకు సంబంధించి సుమారు 150 గ్రాములు బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కొత్తపేట కోర్టులో హాజరుపర్చామన్నారు. ఆమెకు మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

తేనెటీగల దాడిలో కూలీ మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తేనెటీగల దాడిలో వ్యవసాయ కూలీ మతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రవరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎర్రవరం గ్రామానికి చెందిన కోన వెంకటరమణ(54) మంగళవారం సాయంత్రం బహిర్భూమికి ఏలేరు కాలువ గట్టుకు వెళ్లాడు. అక్కడ తేనెటీగలు ఒక్కసారిగా ఆయనపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను స్థానికులు ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బాలికపై అత్యాచారం ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై అత్యాచారం ఘటనకు సంబంధించి వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మంగళవారం సాయంత్రం బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. రాత్రి 7 గంటల సమయంలో ఇంటిముందు ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి చిన్నారిని ఒక సందులోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడని బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. కాకినాడ దిశా డిఎస్‌పి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో పేలిన ఫ్రిజ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రి లేబర్ గదిలో ఉన్న ఫ్రిజ్‌లో గ్యాస్ సిలెండర్ పేలింది. రోగులకు, వైద్య సిబ్బందికి పెను ప్రమాదం తటిలో తప్పింది. హై ఓల్టేజ్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు వైద్యులు చెప్పారు. ఆసుపత్రిలో ఉదయం 9:30 గంటల ప్రాంతంలో రోగులకు వైద్య పరీక్షలు ప్రారంభించారు. ఒక్కసారిగా ఆపరేషన్ థియేటర్ పక్కన ఉన్న పురిటి వార్డు నుంచి పేలుడు శబ్దం వినిపించింది. లోపల ఏం జరిగిందో తెలియక రోగులంతా భయపడి బయటకు పరుగులు తీశారు. వైద్య సిబ్బంది స్పందించి లేబర్ గదిలో ఫ్రిజ్ లోపలి నుంచి వచ్చిన మంటలను అగ్నిమాపక సామగ్రితో మంటలను ఆర్పివేశారు. ప్రమాదం కారణంగా ఆసుపత్రి నూతన విభాగం అంతా పొగతో నిండిపోయింది. ఉదయమే కావడంతో పురిటి వార్డులో ఎవరూ గర్భిణులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. సిబ్బంది తక్షణమే స్పందించి మంటలను అదుపు చేయడంతో గదిలో ఉన్న రికార్డులు ఇతర సామగ్రిని సురక్షితంగా ఉన్నాయి. అదే సమయానికి ఆసుపత్రి వద్ద ఉన్న జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ప్రమాదాన్ని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ప్రమాదానికి కారణమైన హై ఓల్టేజ్ విషయమై ఆసుపత్రి సుపరిండెంటెంట్ డా. అమల విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా ట్రాన్స్ కో సిబ్బంది ఆసుప్రత్రికి చేరుకుని విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ముఖ్యమంత్రి జగన్ మత్స్యకారుల సంక్షేమానికి అన్ని విధాల చర్యలు తీసుకున్నారని కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జగన్నాథపురం 14వ డివిజన్ పరిధిలోని ముల్లారమ్మ ఆలయం వద్ద బుధవారం జరిగిన వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రచార బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారాన్ని సైతం సకాలంలో ఇవ్వకుండా మత్స్యకారులను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు. సిఎం జగన్ అధికారాన్ని చేపట్టిన వెంటనే పరిహారం మొత్తాన్ని పెంచి నిషేధం అమలు జరిగే రోజునే నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. వీటితోపాటు మత్స్యకార సామాజిక వర్గానికి అన్ని విధాల అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఎంతో రాజకీయ ప్రాధాన్యతను ఇచ్చారన్నారు ఇటువంటి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి ఆదరించి సీఎం జగన్ ను రెండోసారి కూడా గెలిపించాలని కోరారు. గడచిన నాలుగున్న ఏళ్లలో 14వ డివిజన్‌కు వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా రూ 49 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, వైసిపి నగర అధ్యక్షులు సుంకర శివప్రసన్న, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతరేకుల ఎగుమతికి చేయూత

ప్రజాశక్తి-ఆత్రేయపురం

విదేశాలకు ఆత్రేయపురం పూత రేకులను ఎగుమతి చేసేందుకు అవసరమైన చేయూతనందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎంఆర్‌ఆర్ ఫుడ్స్ అధినేత రామరాజు తెలిపారు. ఆత్రేయపురం పూతరేకుల కీర్తిని చాటి చెప్పేలా ఢిల్లీ ప్రగతి మైదానంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కో - ఆర్డినేటర్ రాజీవ్‌వర్మ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ స్టాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్రేయపురం పూతరేకుల స్టాల్‌ను మంత్రి అమర్నాథ్ సందర్శించారని ఆయన పేర్కొన్నారు ఈ సందర్భంగా బుధవారం ఆయన ఆత్రేయపురంలో విలేకరులతో మాట్లాడారు. పలు అంశాలను మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రపంచ దేశాల్లో పూత రేకులకు మంచి డిమాండ్ ఉందన్నారు. దేశ కీర్తిని, రాష్ట్ర ప్రతిష్టను పెంచేలా ఆత్రేయపురం పూతరేకులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తమకు సహకారం అందించాలని. అవసరమైన మెషినరీ, ఇతర సదుపాయాలు అందించాలని తద్వారా మరింతగా ఎగుమతులు పెరిగే అవకాశం ఉందని మంత్రిని రామరాజును కోరామని రామరాజు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పూత రేకులకు అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేసేలా ఢిల్లీలో ఫుడ్ స్టాల్ ద్వారా పరిచయం చేయడం హర్షణీయం అన్నారు.

స్టాల్‌ను సందర్శిస్తున్న మంత్రి అమర్నాథ్‌రెడ్డి

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీకి చెందిన మహిళలు ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కు మొరపెట్టుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రజలందరికీ జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ఎన్నో ప్రయాసలకు ఓర్చి గహాలు నిర్మించుకున్నామని, వసతులు లేక అల్లాడుతున్నామని తెలిపారు. కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, రహదారులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఇటీవల ఒక మహిళ విద్యుదాఘాతానికి గురైందన్నారు. దీనిపై ఎంఎల్ఎ స్పందించారు. సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్

11న 'హలో మాదిగ చలో అమలాపురం'

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

డిసెంబర్ 11న జిల్లాలోని పొలిటికల్ జెఎసి తరపున నిర్వహించే మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ మహాసభ 'హలో మాదిగ చలో అమలాపురం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నడిపూడిలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్లో మాదిగల ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ బొమ్మి ఇజ్రాయిల్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హలో మాదిగ చలో అమలాపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రవీంద్ర, మడికి శ్రీరాములు, చెట్ల రామారావు, మంద గాంధీ, ఖండవిల్లి ఏలియా, ఆకుమర్తి మోహన్, బడుగు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అధికార పార్టీకే లాభం తప్ప సమాజానికి ఉపయోగం లేదని అమలాపురం మండలం బండారులంకకు చెందిన శ్రీశైలం మాజీ ట్రస్టీ చింత శంకరమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా జగనన్న సురక్ష హడావిడే తప్ప ప్రజలకు ఏమాత్రం మేలు జరగలేదన్నారు. సురక్షకు నిర్వహణకు చేసిన ఖర్చుతో పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రి, గవర్నమెంట్ హాస్పిటల్స్ లకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూర్చి అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికైనా ఇలాంటి ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా ఆరోగ్యశాఖ ఉందని, కొత్తగా సురక్ష లాంటి కార్యక్రమాలు అవసరం లేదని అన్నారు. ఉదాహరణకు బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్వర్టర్ లోటుగా ఉందని, సిబ్బంది తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇటీవల గర్భిణులు ప్రసవం సమయంలో విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇన్వర్టర్ సమకూరిస్తే విద్యుత్ సమస్య తీరుతుందన్నారు.

వైసిపి మీడియా కో-ఆర్డినేటర్‌గా శివరామకృష్ణ

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం మండల వైసిపి మీడియా కోఆర్డినేటర్‌గా కరాసు శివరామకృష్ణను నియమిస్తున్నట్లు ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం అచ్యుతాపురంలో ఆయనను ఎంఎల్ఎ చంటిబాబు సత్కరించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడారు. తనకు బాధ్యతను అప్పగించిన ఎంఎల్ఎ, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ ధర్నా విజయవంతం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఉపాధ్యాయ, ఉద్యోగ ఆర్థిక ప్రయోజనాల కోసం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో ధర్నా విజయవంతంగా జరిగిందని ఎపిటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ ధర్నాకు తూర్పుగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలతోపాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో పోషకాహారం లోపం గల పిల్లలను దత్తత తీసుకుని పౌష్టికాహారాన్ని అందించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని గోరక్షణపేటలో షేక్ ఫారూక్‌ను దత్తత ఆయన తీసుకున్నారు. బుధవారం ఫారూక్ ఇంటికి ఆయన వెళ్లి ఆ బాలుడితో కొద్ది సమయం గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపం గల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు 'బంగారు కొండ' పథకాన్ని జూన్ నెలలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం ద్వారా దత్తత తీసుకున్న పిల్లలను 6 నెలల పాటు ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. తమ తమ పరిధిలో గల పోషకాహార లోపం గల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. నగరపాలక సంస్థ సిబ్బంది 35 మందిని దత్తత తీసుకుని ఎప్పటికప్పుడు వారిని కలుసుకుని వారికి అందుతున్న పౌష్టికాహార వివరాలు, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

యుటిఎఫ్ గోకవరం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గోకవరం

కోరుకొండలో మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎంపికయ్యింది. యుటిఎఫ్ గౌరవాధ్యక్షులుగా ఎం భాస్కరరావు, అధ్యక్షులుగా జివి.శివ బాబు, ఉపాధ్యక్షులుగా డిఎల్‌కె.ప్రసాద్, మహిళ సహాయ అధ్యక్షురాలుగా సిహెచ్.సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా పి.లోవరాజేష్, కోశాధికారిగా ఎం.చల్లారావు, కార్యదర్శులు ఎం.వీర్రాజు, కె.మోహన్ రావు, ఎస్ఎస్ఆర్.కృష్ణ కుమార్, టివి.భగవానులు, కె.వీరబాబు, వికె.సుధాకర్, కె.నూకరాజు, డి.అశోక్ కుమార్, జిపిజె.మణికుమార్, నాగేంద్ర, మండల ఆడిట్‌గా ఎస్.గుబ్బాలు, యుటిఎఫ్ కార్యాలయం ఇన్‌ఛార్జ్‌గా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

యాంటీ మైక్రోబియల్‌తో ప్రమాదం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రొయ్యలు, చేపలు పెంపకంలో యాంటీ మైక్రోబియల్స్‌ను అధికంగా వాడటం వల్ల ఆక్వా రంగానికి పెను ప్రమాదం పొంచి ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వాకల్చర్ (నాక్సా) సిఇఒ డాక్టర్ టి మనోజ్ కుమార్ అన్నారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ హాలులో బుధవారం నాక్సా ఆధ్వర్యంలో యాంటీ మైక్రోబియల్ నిరోధకత అంశంపై ఆక్వా రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) వీక్‌లో భాగంగా యాంటీబయాటిక్స్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించడానికి, యాంటీబయోటిక్స్ వ్యాప్తిని నిరోధించడానికి, ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. తొలుత సెమినార్‌ను తాళ్లరేవు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి ప్రారంభించారు.

పటిష్టంగా పిసిపిఎన్‌డిటి చట్టం అమలు

ప్రజాశక్తి-కాకినాడ

పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తూ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ ప్రక్రియ దుర్వినియోగం కాకుండా నిశిత నిఘా కొనసాగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జెసి మాట్లాడారు. పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు, రహస్య డెకాయి ఆపరేషన్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమాలను పటిష్టంగా కొనసాగించాలని డివిజన్ స్థాయి కమిటీలను జాయింట్ కలెక్టర్ కోరారు. అనంతరం 2 స్కానింగ్ సెంటర్లకు అనుమతుల రెన్యూవల్, 7 సెంటర్లకు సంబంధించి అడ్రసు, మిషన్, సిబ్బంది మార్పులకు అమోదం కమిటీ జారీ చేసింది. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్, డిఐఒ డాక్టర్ కె.రత్నకుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.సరిత, సిఐ పి.ఈశ్వరుడు పాల్గొన్నారు.

తాళ్లరేవులో 'భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవులో టిడిపి ఆధ్వర్యారన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నాయకుడు రోళ్ల చక్రవర్తి నివాసం నుంచి మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, నడింపల్లి వినోద్, ధూళిపూడి బాబి, మోపూరి వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, ఉంగరాల బూరిబాబు, జక్కల ప్రసాద్ బాబు, మోర్త భైరవమూర్తి, వెంటపల్లి చంద్రమౌళి, మేడిశెట్టి సత్తిబాబు, గంజా సూరిబాబు, పొన్నమండ రామలక్ష్మి, టి.లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కరప

కరప నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు బొల్లం రెడ్డి వీరవెంకట సత్యనారాయణ ప్రస్తుతం తిమ్మాపురం ఎఎస్ఐగా పనిచేస్తున్నారు. పేద విద్యార్థిని ముచ్చుపల్లి భాగ్యలక్ష్మి కాకినాడ విజయ గాయత్రి జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ ఫీజు కట్టేందుకు ఇబ్బందులు పడుతుంది. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కోరిక మేరకు ఎస్ఐ విద్యార్థినికి రూ.13 వేల ఆర్థిక సాయం అందించారు.

జిఒ 116ను రద్దు చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి- అమలాపురం

జిఒ 116ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంత్రి పినిపే విశ్వరూప్‌నకు బుధవారం వినతిపత్రం అందించారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.విష్ణు, ప్రధాన కార్యదర్శి పి.నరేష్‌బాబు, నాయకులు కెఎన్‌బి.లక్ష్మి, కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

లబ్ధిదారుల జాబితా విడుదల

ప్రజాశక్తి - యానాం

ఒఎన్‌జిసి పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో 918 మందిని అర్హులుగా గుర్తించి జాబితా విడుదల చేస్తున్నామని, అభ్యంతరాలుంటే ఈ నెల 18లోగా తెలపాలని మత్స్యశాఖ ఎడి దడాల గొంతియ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విలేజ్ లెవెల్ కమిటీ ద్వారా విచారణ చేసి ఆ జాబితాను గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. పరిపాలనాధికారి కార్యాలయం, లేబర్ ఆఫీస్, మత్స్యశాఖ కార్యాలయాల నోటీసు బోర్డులో జాబితాలను ఉంచామన్నారు.

దుండగులు ధ్వంసం చేసిన బోటు

దుండగుల చేతిలో బోటు ధ్వంసం

ప్రజాశక్తి - యానాం

స్థానిక సావిత్రి నగర్‌కు చెందిన మత్స్యకారుడు కాలాడి భైరవమూర్తి బోటును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. సావిత్రి నగర్ జెట్టీ వద్ద పెట్టిన బోటును గోదావరి ఒడ్డుకు తీసుకెళ్లి గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేశారని బాధితుడు పోలీసులు వద్ద వాపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రబీకి పూర్తిస్థాయిలో నీరు అందిస్తాం

ప్రజాశక్తి -కరప

రబీకి పంటకు కరప, కాజులూరు, తాళ్లరేవు, మండలాలకు పూర్తి స్థాయిలో నీరందిస్తామని ఎడిఎ కె.బాబూరావు తెలిపారు. నడకుదురు ఎడిఎ కార్యాలయంలో మూడు మండలాలకు సంబంధించిన వ్యవసాయ సలహా మండలి సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించామని ఎడిఎ తెలిపారు. డిసెంబర్ నెలాఖరునాటికి నాట్లు పూర్తి చేయాలలన్నారు. మార్చి చివరినాటికి దాల్వా పంట చేతికి వస్తుందని దీని వల్ల నీటి ఎద్దడిని ఎదుర్కొనొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కరప వ్యవసాయ అధికారి రాజేష్, చైర్మన్లు గుత్తుల బుల్లిరాజు, ఎఎబి మెంబరు బి.సూర్యనారాయణ, బందే పట్టాభిరామయ్య, చింత ఈశ్వరరావు, రావుల ప్రసాద్, భూపతి రామచంద్ర రాజు, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ మాధవి, ఎఇఒ ఎంవివి.సత్యనారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైక్ సెట్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం బలుసుల పేటలోని రామాలయానికి అన్నవరం దేవస్థానం సభ్యులు పవర గ్రామానికి చెందిన సిహెచ్.రాజబాబు మైక్ సెట్‌ను సమకూర్చారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, దవులూరి దొరబాబు చేతుల మీదుగా దీన్ని బుధవారం రామాలయం కమిటీ నాయకులు, 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్ నేతల వెంకట లక్ష్మికి అందజేశారు.

In The Court Of The 3rd Additional Distirct Judge Kakinada (MACT)
M.V.O.P.No. 150/2021
Between:
Nemani Kondala Rao and Others ...*Petitioners*
AND
Perla Sathibabu and Others ...*Respondents*
TO:
R-2: Tata Basava Sankara Rao, S/o. Musalayya, D.No. 10-2-17/A, Pamuvari Street, Ramarao Peta, Kakinada.
పై నెంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.07-12-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషను మీకు పరోక్షమున తీర్మానించబడును.
B.RADHA KRISHNA
A.ANIL KUMAR RAJA
Advocates, Kakinada.
Cell: 94403 23951

మహారాజశ్రీ కాకినాడ 5వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A. 170/2023 in O.S. 342/2023
Between :
మానేపల్లి సుధీర్ ...పిటీషనర్ / వాది
మరియు
1) మణుగుల నరసింహారావు, S/o. మల్లేశ్వరరావు, డో.నెం. 3-143, చేపల మార్కెట్ దగ్గర, వినాయకుని గుడి వెనుక, సర్పవరం, కాకినాడ రూరల్.
2) బొండాడ చిన రాజారావు, S/o. ఏసురత్నం కోలంక, పిఠాపురం మండలం.
...రెస్పాండెంట్లు / ప్రతివాదులు
పై నెంబరు దావాలో పిటీషనరు 1వ ప్రతివాది వ్రాసిన ది. 08-04-2022వ తేదీగల స్వాధీన క్రియ అగ్రిమెంటు షరతుల ప్రకారం దస్తావేజు రాయనందున, Specific Performance నిమిత్తం కోర్టులో కేసు దాఖలు చేసినారు. మీకు కోర్టువారు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికీ మీరు తీసుకునియుండలేదు. కావున మీ హాజరు నిమిత్తం కోర్టువారు **ది. 08-12-2023** తేదీనాటికి వాయిదా వేసియున్నారు. ఆ రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయముగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవచ్చును. లేని ఎడల దావా మీ పరోక్షమున తీర్మానించెదరు.
V.N.V.V. శ్రీరామమూర్తి,
అడ్వకేట్
డో.నెం. 20-11-13, రత్నాటవర్స్, మెజెస్టిక్ వీధి, కాకినాడ. కాకినాడ. సెల్: 98488 20708, 94410 76391
ది.15-11-2023

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

బడుగువానిలంకలో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువాని లంకలో జనసేనతో ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా పర్యటించి ప్రస్తుతం ప్రభుత్వం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేనకు అవకాశం ఇస్తే కచ్చితంగా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్ల డేవిడ్, సంగీత సుభాష్, బొక్కా ఆదినారాయణ, సూరపురెడ్డి సత్య, ఎంపిటిసి సభ్యులు పడాల నాగలక్ష్మి పాల్గొన్నారు.

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
మీరు విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి
అయితే దరఖాస్తు పంపండి
దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
విలేకర్లు కావలెను
◆ రాజమండ్రి సిటీ ◆ రాజమండ్రి కార్పొరేషన్ ◆ రాజమండ్రి క్రైం
◆ కోరుకొండ ◆ రంగంపేట ◆ కిర్లంపూడి ◆ కాకినాడ కార్పొరేషన్
◆ కాకినాడ భానుగుడి ◆ పెద్దాపురం రూరల్ ◆ కిర్లంపూడి ◆ తుని
◆ తుని రూరల్ ◆ తొండంగి ◆ ప్రత్తిపాడు ◆ గొల్లప్రోలు
◆ పి.గన్నవరం ◆ ముమ్మిడివరం ◆ అల్లవరం ◆ రాయవరం
◆ కె.గంగవరం ◆ మలికిపురం ◆ సఖినేటిపల్లి ◆ అనపర్తి
◆ నిడదవోలు రూరల్
విలేకర్లకు అర్హత
ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయాలి
prajagodavari@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 92918 01804, 94900 99169

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - పెదపూడి

తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో పమాదాల నివారణ కోసం పెదపూడి ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసును తలపించేలా బొమ్మ ట్రాఫిక్ పోలీస్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. పెదపూడి నుంచి వేట్లపాలెం వెళ్లే రహదారిలో సత్రం సెంటర్ వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాల అతివేగం వల్ల కాలువలోకి పల్టీ కొడుతున్నాయి. దీంతో ఆ కాలువ సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు తలపించేలా బొమ్మ పోలీస్ స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యువత పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని రిటైర్డ్ ఎల్ఐసి అధికారి తాతారావు అన్నారు. సీతంపేట ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు గ్రంథాలయ అధికారి ఎం.వీరలింగం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి అర్బన్ డిఐ బి.దిలీప్‌కుమార్, రిటైర్డ్ ఎల్ఐసి ఆఫీసర్ చెక్కా తాతారావు, ఎ.కృష్ణశర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత తాతారావు మాట్లాడారు. సమాజంలో యువత ప్రాముఖ్యత, యువత నిర్వహించాల్సిన కర్తవ్యాలను వివరించారు. యువత సక్రమమైన మార్గంలో నడిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డిఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు, జ్ఞానంతోనే ఉన్నత స్థానాలను అధిరోహించొచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులను సత్కరించారు. వీరలింగం, డి.రాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులు స్వీట్లు పంచారు.

మాట్లాడుతున్నతాతారావు